

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి శుక్రవారం 15-05-2026 సంపుటి: 02 సంచిక : 14 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Friday 15-05-2026 Volume :02 Issue: 14 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani





Contact Number 9059328777


## ఆదా చేద్దాం..

# ఇంధనం!

### ప్రధాని బాటలో ఏపీ, తెలంగాణ సీఎంలు

### పొదుపు మంత్రం పాటిస్తున్న ముఖ్యమంత్రులు

- కాన్వాయ్‌లలో కోత విధించిన చంద్రబాబు, రేవంత్
- మంత్రులకు సైతం వాహనాలు కట్
- ప్రభుత్వ ఉద్యోగులకు వాహన షేరింగ్ ప్రతిపాదన
- పగటిపూట ఏసీలు కట్.. సోలార్ పవర్‌కు ప్రాధాన్యం
- వాహనశ్రేణిలో విద్యుత్ వాహనాలపై మొగ్గు

పశ్చిమాసియాలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో దేశంలో పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ క్రమంలో దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇంధన పొదుపు చర్యలను చేపట్టడంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు అడుగులు వేస్తున్నారు. సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండటంతో పాటు ప్రభుత్వ ఖర్చులను తగ్గించడమే లక్ష్యంగా ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

2 లో





## మూడో దశ 'సర్'

# షెడ్యూల్ విడుదల

- తెలంగాణ, ఏపీతో పాటు 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రక్రియ
- తెలంగాణ, పంజాబ్‌లో ఒకేసారి 'సర్' ప్రారంభం

**న్యూఢిల్లీ**

మూడో దశ స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(సర్)కు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. తెలంగాణ, ఏపీతో పాటు 16 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత పాంత్రాల్లో ఈ ప్రక్రియ చేపట్టనున్నట్టు తెలిపింది. ఈ మేరకు గురువారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసింది. మొత్తం ఎనిమిది విడతల్లో ఈ మూడో దశ 'ఎస్ఐఆర్'ను నిర్వహించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఏపీతో పాటు ఒడిశా, మిజోరాం, సిక్కిం, మణిపూర్, దాద్రానగర్ హవేలీ, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, చండీగఢ్, పంజాబ్, కర్నాటక, మహారాష్ట్ర, జార్ఖండ్, మేఘాలయ, ఢిల్లీ, నాగాలాండ్, త్రిపుర ఉన్నాయి. ఇందుకోసం 3.92 లక్షల మందికిపైగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) 36.73 కోట్ల మంది ఓటర్ల వద్దకు వెళ్లనున్నారు. వీరికి లెక్కింపు దశలో రాజకీయ పార్టీలచే నియమించబడిన మరో 3

-మిగతా 2 లో

## ఇంటర్ విద్యా విధానంలో మార్పులు

- ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్ పరీక్షలు
- మార్పులకు సిద్ధం అవుతున్న బోర్డు



**హైదరాబాద్, మే 14 (నేటి దర్శిని)**

ఇంటర్ విద్యా విధానంలో తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి కీలక మార్పులు చేపట్టేందుకు సిద్ధమైంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసింది. కొత్త విధానంలో సైన్స్, మ్యాథ్స్, భాషా విభాగాల్లో పరీక్షల సరళి, మార్కుల విధానం, ప్రాక్టికల్స్ నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటి వరకు ఇంటర్ సెకండియర్‌లో మాత్రమే ప్రాక్టికల్స్ నిర్వహించగా,

-మిగతా 2 లో

## మరోమారు తెరపైకి ఫార్ములా-ఈ రేస్ కేసు

- కేటీఆర్ తదితరులకు ఎసిబి నోటీసులు
- జూలై 31న విచారనకు రావాలని ఆదేశాలు



**హైదరాబాద్ మే 14 (నేటి దర్శిని)**

తెలంగాణలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. జూలై 31వ తేదీన విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి నోటీసులు జారీ చేసింది. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు

-మిగతా 2 లో



## తెలంగాణలో..

# నిప్పుల సెగలు

- 45 డిగ్రీల కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు
- ఉత్తర తెలంగాణలో మూడు రోజులు రెడ్ అలర్ట్
- పగటి వేళ బయటకు రావద్దన్న అధికారులు

**హైదరాబాద్, మే 14 (నేటి దర్శిని)**

ఉత్తర తెలంగాణకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. మూడు రోజుల పాటు ఉత్తర తెలంగాణలో ఎండలు తీవ్రరూపం దాల్చనున్నట్లు ప్రకటించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు అలర్ట్ జారీ చేసింది. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మూడు రోజులు వడగాలుల ప్రభావం కూడా తీవ్రంగా ఉండనుందని తెలిపింది. ఎండల తీవ్ర నేపథ్యంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించింది.

-మిగతా 2 లో

## మోడీ సర్కార్

# ఫెయిల్

### నీట్-యూజీ2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయం




- మోడీ హయాంలోనే 93 పేపర్లు లీక్
- పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు
- ఆందోళనలో రెండు కోట్ల మంది విద్యార్థులు
- కేంద్రం తీరుపై ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్, మే 14 (నేటి దర్శిని)**

నీట్-యూజీ2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వఏకపక్షరద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గతపదేండ్లుగాప్రధాని మోడీ హయాంలో93పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతు న్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. నీట్ రద్దు.. దేశ ప్రజలను తీవ్ర దిగ్భాంరతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా

-మిగతా 2 లో



## పొదుపు చర్యలకు దిగిన

# ఢిల్లీ ప్రభుత్వం

- వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్
- వారానికి ఒకరోజు నో వెహికిల్ డే
- సిఎం రేఖాగుప్తా పలు నిర్ణయాలు ప్రకటన

**న్యూఢిల్లీ,**

దేశవ్యాప్తంగా ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ, ప్రజా రవాణా వినియోగంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం కూడా కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పొదుపు సూత్రాల పిలుపు మేరకు ఢిల్లీ ప్రభుత్వం పలు సంస్కరణాత్మక చర్యలను ప్రకటించింది. ముఖ్యమంత్రి రేఖాగుప్తా ఆధ్వర్యంలో తీసుకున్న ఈ నిర్ణయాలు ప్రభుత్వ ఖర్చులు తగ్గించడం, ఇంధన వినియోగ నియంత్రణ, ప్రజా రవాణా ప్రోత్సాహంపై కేంద్రీకృతమై ఉన్నాయి. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, ఇంధన వినియోగాన్ని నియంత్రించడం లక్ష్యంగా ఢిల్లీ ప్రభుత్వం ఉద్యోగులకు వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం రేపటి నుంచే అమల్లోకి వస్తుందని సీఎం రేఖా గుప్తా ఆదేశాలు జారీ చేశారు. ఈ విధానం వల్ల

-మిగతా 2 లో

## బండి భగీరథ్ ముందస్తు బెయిల్..

# వారం రోజులకు వాయిదా



2 లో



## కేరళ సీఎంగా

# వీడీ సతీశన్

- 10 రోజుల ఉత్కంఠకు తెర
- 18న ప్రమాణ స్వీకారం
- వేణుగోపాల్ వర్గం అసంతృప్తి

**న్యూఢిల్లీ,**

కేరళ తదుపరి ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ పేరును కాంగ్రెస్ పార్టీ గురువారం ప్రకటించింది. దీంతో గత కొన్ని రోజులుగా నెలకొన్న ఉత్కంఠ, ఊహాగానాలకు తెరపడింది. ముఖ్యమంత్రిగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన సతీశన్ ఎంపికను ఏఐసీసీ కేరళ ఇన్‌చార్జ్ దీపా దాస్‌మున్షీ, రాష్ట్రం కోసం పార్టీ నియమించిన కేంద్ర పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్ విలేకరుల సమావేశంలో ప్రకటించారు. సతీశన్ ఈ నెల 18న ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారు. ముఖ్యమంత్రి పదవి కోసం వీడీ సతీశన్, కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితల పోటీపడ్డారు. ఈ సందర్భంగా సతీశన్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించడంలో ఏఐసీసీ యత్నాలను సమన్వయం చేసి పార్టీ కార్యకలాపాలన్నింటికీ మద్దతు ఇచ్చిన కాంగ్రెస్

-మిగతా 2 లో

## నేటి నుంచి ప్రధాని


# ఐదు దేశాల పర్యటన

- హరిత ఇంధనం నుండి సెమీకండక్టర్ల వరకు.. ఒప్పంద అవకాశాలు
- ప్రధాని పర్యటన భారతీయ ఎగుమతులకు వ్యూహాత్మక మలుపు కానుందన్న ఎఫ్ఐఈఓ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ: మే 14 (నేటి దర్శిని)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 15 నుండి 20 వరకు చేపట్టనున్న ఐదు దేశాల పర్యటనకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ పూర్తి మద్దతు ప్రకటించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి నెలకొన్న ప్రస్తుత తరుణంలో, ఈ పర్యటన భారతీయ

-మిగతా 2 లో



# తెలంగాణలో.. నిప్పుల సెగలు

మొదటి తరువాయి

అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని వాతావరణ శాఖ తెలిపింది. బయటకు వెళ్లవలసి వస్తే తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచనలు జారీ చేసింది. ఎండల తీవ్రత కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# పొదుపు చర్యలకు దిగిన ఢిల్లీ ప్రభుత్వం

మొదటి తరువాయి

ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వాహనాల సంఖ్య తగ్గి, కాలుష్య నియంత్రణకు తోడ్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ ఖర్చులు తగ్గించడంలో భాగంగా సీఎం కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను నాలుగుకు పరిమితం చేశారు. ఇందులో రెండు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని నిర్ణయించారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది.

పౌరుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో 'నా భారతదేశం ? నా కర్తవ్యం' పేరుతో ప్రత్యేక ఉద్యమాన్ని ఢిల్లీ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమం 90 రోజుల పాటు కొనసాగనుంది.ఇంధన పొదుపు, ప్రజా రవాణా వినియోగం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యం. ప్రభుత్వ ఉద్యోగులు, మంత్రులు, ఉన్నతాధికారులు ప్రతి సోమవారం తప్పనిసరిగా ఢిల్లీ మెట్రోలోనే ప్రయాణించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిని 'మండే మెట్రో' పేరుతో ప్రత్యేక కార్యక్రమంగా అమలు చేయనున్నారు. ఈ నిర్ణయం ద్వారా ప్రజారవాణా వినియోగాన్ని ప్రోత్సహించడమే కాకుండా, ట్రాఫిక్ రద్దీ తగ్గించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. సామాన్య ప్రజలు కూడా వారంలో కనీసం ఒక రోజైనా 'నో వెహికిల్ డే' పాటించాలని ప్రభుత్వం సూచించింది. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి, సైకిళ్లు, మెట్రో, బస్సులు వంటి పర్యావరణహిత రవాణా మార్గాలను వినియోగించాలని కోరింది. ప్రభుత్వ శాఖలు వచ్చే ఆరు నెలల వరకు పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు చేయెద్దని ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైతే ఇప్పటికే ఉన్న వాహనాలనే వినియోగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇది ప్రభుత్వ ఖర్చులను తగ్గించడమే కాకుండా, వనరుల సమర్థ వినియోగానికి దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను 10 శాతం పెంచుతూ ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ చర్య తీసుకున్నట్లు తెలిపింది. ప్రభుత్వ వ్యయ నియంత్రణలో భాగంగా వచ్చే ఏడాది వరకు అన్ని విదేశీ అధికారిక పర్యటనలను పూర్తిగా రద్దు చేశారు. అత్యవసర పరిస్థితులు మినహా విదేశీ ప్రయాణాలకు అనుమతి ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఢిల్లీ ఇప్పటికే వాయు కాలుష్య సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పర్యావరణ పరిరక్షణకు కీలకంగా మారే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వర్క్ ఫ్రం హోమ్, మెట్రో వినియోగం, నో వెహికిల్ డే వంటి చర్యలతో వాహనాల సంఖ్య తగ్గి కాలుష్యం నియంత్రణలోకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.

# కేరళ సీఎంగా వీడీ సతీశన్

మొదటి తరువాయి

ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు ధన్యవాదాలు తెలిపారు.ప్రచార కమిటీ చైర్మన్‌గా పనిచేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రమేశ్ చెన్నితలకు కూడా ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీ విజయంలో పోషించిన పాత్రను ప్రస్తుతిస్తూ ఆయన నా నాయకుడు కూడా అని అన్నారు. ముఖ్యమంత్రి పదవిని సాధించడంలో సహాయపడిన లక్షలాదిమంది పార్టీ కార్యకర్తలకు, యూడీఎఫ్ సంకీర్ణ భాగస్వాములకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమ నాయకుడిని సీఎంగా ప్రకటించకపోవడంపై కేసీ వేణుగోపాల్ వర్గీయులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. కాగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దాదాపు 40 నిమిషాలపాటు సమావేశమైన మరుసటి రోజు కేరళ ముఖ్యమంత్రి ప్రకటన వెలువడింది. పార్టీ అధిష్టాన వర్గం చర్చలు పూర్తి చేసినట్లు బుధవారం కాంగ్రెస్ ప్రకటించింది. మే 4న కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 140 స్థానాలకు గాను 102 స్థానాలను కైవసం చేసుకున్నప్పటి నుంచి కేరళ తదుపరి ముఖ్యమంత్రిపై నిర్ణయం పెండింగ్‌లో ఉంది. పార్టీ పరిశీలకులు మాకెన్, వాస్నిక్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలసి వారి అభిప్రాయాలను సేకరించిన తర్వాత కూడా రోజుల తరబడి అనిశ్చితి కొనసాగడంతో పార్టీ కేంద్ర నాయకత్వం విస్తృత సంప్రదింపులు జరిపింది. పార్టీ నాయకత్వం ఆ పదవికి పోటీపడుతున్న ముగ్గురు ప్రధాన అభ్యర్థులతోపాటు కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌తో కూడా చర్చలు జరిపింది. సతీశన్, వేణుగోపాల్, చెన్నితలకు మద్దతు ఇచ్చే వర్గాల మధ్య అంతర్గత పోటీ కారణంగా కేరళలో కాంగ్రెస్ విజయం మరుగున పడింది. ముఖ్యమంత్రి పేరును ప్రకటించడంలో జరుగుతున్న జాప్యం పార్టీ కార్యకర్తలతోపాటు సంకీర్ణ భాగస్వామ్య పక్షాలలో కూడా ఆందోళన రేకెత్తించింది.

# మూడో దశ 'సర్' షెడ్యూల్ విడుదల

మొదటి తరువాయి

.42 లక్షల బూత్ లెవల్ ఏజెంట్లు(బీఎలఏలు) సహాయంగా నిలవనున్నారు. అయితే ఈ ప్రక్రియకు సహకరిస్తూ... తమ పార్టీల నుంచి బీఎలఏలను నియమించాలని రాజకీయ పార్టీలను ఈసీ కోరింది. తొలి రెండు దశల్లో 13 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో జరిగిన సర్ ప్రక్రియలో దాదాపు 59 కోట్ల మంది ఓటర్లను చేరినట్టు వెల్లడించింది. ఈ ప్రక్రియ కోసం 9.2 లక్షలకుపైగా బీఎలఏలు పలు రాజకీయ పార్టీల నుంచి పాలుపంచుకున్నట్టు తెలిపింది. కాగా దేశవ్యాప్త జనగణనలో ఇండ్ల జాబితా ప్రక్రియ, యంత్రాంగాన్ని దఅష్టిలో పెట్టుకొని హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లధక్‌లకు ఈ మూడో దశ నుంచి మినహాయింపు ఇచ్చినట్టు పేర్కొంది. ఈ మూడు రాష్ట్రాలు/యూటీల్లో స్థానికంగా ఉండే చల్లని వాతావరణం, ఎత్తైన ప్రాంతాలను దఅష్టిలో పెట్టుకొని సర్ షెడ్యూల్‌ను ప్రకటిస్తామని తెలిపింది.

**తెలంగాణ, పంజాబ్‌లో ఒకేసారి 'సర్' ప్రారంభం**

తెలంగాణతో పాటు పంజాబ్‌లో ఒకేసారి ఈ ఎసఐఆర్ ప్రకియ ప్రారంభించనున్నట్టు ఈసీ వెల్లడించింది. ప్రస్తుతం తెలంగాణలో మే12 నాటికి 3,39,20,705 మంది ఓటర్లు ఉన్నట్టు తెలిపింది. వీరిని చేరేందుకు 35,985 మంది బీఎలఓలు, 25,886 మంది బీఎలఏల సహాయం తీసుకోనున్నట్టు పేర్కొంది. కాగా ఈ సిబ్బందికి జూన్ 15 నుంచి 24 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటి సర్వే చేపడతారు. ఆ తరువాత జులై 31న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటించి, అదే రోజు నుంచి సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. చివరగా అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను ఈసీ ప్రకటించనుంది.

# బండి భగీరథ్ ముందస్తు బెయిల్.. వారం రోజులకు వాయిదా



హైదరాబాద్

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై హైదరాబాద్ లోని పేట్ బషీర్‌బాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం భగీరథ్ హైకోర్టును ఆశ్రయించాడు. గురువారం (మే 14) హైకోర్టులో ఈ పిటిషన్ పై విచారణ జరగగా.. భగీరథ్ తరుపున ప్రముఖ లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. వాదనాలు విన్న న్యాయస్థానం వారం రోజులకు వాయిదా వేసింది. మధ్యంతర బెయిల్ పిటిషన్ పై శుక్రవారం (మే 15) విచారణ చేపడతామని పేర్కొంది. బాధితురాలు పుట్టిన రోజు డేట్స్‌పై, గతంలో రాష్ డ్రైవింగ్ కేసులో అమ్మాయి మేజర్ అని పోలీసులు ఫైల్ చేసిన ఛార్జ్ షీట్ పట్ల పోలీసులు విచారణ జరపాలని హైకోర్టు ఆదేశించింది. వీటి ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. అయితే, ముందస్తు బెయిల్ వచ్చే వరకు అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఆదేశాలు ఇవ్వాలని భగీరథ్ తరుపు లాయర్ కోరగా.. మధ్యంతర బెయిల్?పై శుక్రవారం (మే 15) విచారణ చేపడతామని హైకోర్టు స్పష్టం చేసింది.


# మోడీ సర్కార్ ఫెయిల్

మొదటి తరువాయి

పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది పేరెంట్స్ నగలు అమ్మి తమపిల్లలనునీట్ ఎగ్జామ్ కు ప్రిపేర్ చేయించారని... వారి ఆశలన్నీగల్లంతవడంబాధాకరమన్నారు. 2019 నుండి 15 రాష్టాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్రే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయన్నారు. 2014 మే నెలలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారతదేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ విడుదల చేసిన 'ది పేపర్ లీక్ డెకేడ్' శ్వేతపత్రం ప్రకారం, కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలుజరిగాయని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. వీటివల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని చెప్పారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు. నీట్-యూజీ (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసి-నెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్-నెట్, నీట్-పిజిరద్దుఅయినట్టు గుర్తు చేశారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ కుంభకోణాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ) చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత, 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసిందన్నారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు. నీట్రద్దునేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దనిభరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీనిచ్చారు.

# ఇంటర్ విద్యా విధానంలో మార్పులు

మొదటి తరువాయి




కొత్త విధానంలో ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్ ప్రవేశపెట్టనున్నారు. ప్రత్యేకంగా ఫిజిక్స్, కెమిస్టీ, బోటనీ, జువాలజీ విభాగాల్లో ఫస్టియర్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. కొత్త విధానం ప్రకారం.. ఇంటర్ ఫస్టియర్‌లో, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనుంది. దీంతో విద్యార్థులు కేవలం థియరీకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని కూడా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. మ్యాథమేటిక్స్ బోధనలోనూ కీలక మార్పులు తీసుకురానుంది. సంప్రదాయ పద్ధతికి బదులుగా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను అమలు చేయనుంది. దీంతో విద్యార్థులు సూత్రాలను అర్థం చేసుకోవడం, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించుకోవడం, కాన్సెప్ట్ ఆధారిత విద్యనభ్యసించడం వంటి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మ్యాథ్స్‌లో 75 మార్కులకు ÷నైల్ పరీక్ష నిర్వహిస్తుండగా, కొత్త విధానంలో దాన్ని 60 మార్కులకు తగ్గించనుంది. అదేవిధంగా యాక్టివిటీలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు ప్రాధాన్యం పెంచే అవకాశం ఉంది.

ఇప్పటివరకు ఇంటర్ పరీక్షలు 100 మార్కులకు నిర్వహించగా, ఇకపై వాటిని 80 మార్కులకు నిర్వహించనున్నట్లు సమాచారం. మిగిలిన మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రాక్టికల్స్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ద్వారా కేటాయించే అవకాశం ఉంది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ వంటి భాషా విభాగాల్లో 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు కేటాయించనుంది. ఇందులో ప్రాజెక్టులు సెమినార్లు, అసైన్‌మెంట్లు, క్లాస్‌రూమ్ పనితీరు ఆధారంగా మార్కులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త విధానంతో విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంతమేర తగ్గే అవకాశం ఉందని విద్యా నిపుణులు భావిస్తున్నారు. ఒక్క ÷నైల్ పరీక్ష ఆధారంగా కాకుండా, ఏడాది పొడవునా విద్యార్థుల పనితీరును అంచనా వేసే విధానం అమల్లోకి రానుంది. ఈ సంస్కరణలు జాతీయ విద్యా విధానం(ఔఇఖ)కు అనుగుణంగా తీసుకువస్తున్నట్లు సమాచారం. విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా విద్యా నిపుణులు పేర్కొంటున్నారు. ఇంటర్ విద్యా విధానంలో వస్తున్న ఈ మార్పులు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# నేటి నుంచి ప్రధాని ఐదు దేశాల పర్యటన

మొదటి తరువాయి



ఎగుమతులకు ఒక వ్యూహాత్మక మలుపు కానుందని ఎఫ్ ఐఈఓ అధ్యక్షుడు ఎన్.సి. రల్వాన్ అభివర్ణించారు.మే 15 న ప్రారంభమయ్యే ఈ పర్యటన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీ దేశాల్లో సాగనుంది. ఈ ఐదు దేశాలతో భారతదేశానికి సమిష్టిగా 70 బిలియన్ డాలర్లకు పైగా ద్వైపాక్షిక వాణిజ్యం ముడిపడి ఉందని ఎన్.సి. రల్వాన్ పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, భారత్-ఈఎఫ్టీఏ వాణిజ్య ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం నేపథ్యంలో ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.ఇది భారతీయ ఎగుమతిదారులకు సాంప్రదాయ రంగాలు మాత్రమే కాకుండా.. గ్రీన్ హైడ్రోజన్, సెమీకండక్టర్లు, రక్షణ తయారీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ వాణిజ్యంలి వంటి అత్యాధునిక రంగాలలో అరుదైన అవకాశాలను కల్పిస్తుందని అంచనా వేస్తున్నారు.

**యూఏఈతో** భారతదేశ సంబంధాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా మారాయి. మధ్యప్రాచ్యం, ఆఫ్రికా మార్కెట్లకు ఈ గల్ఫ్ దేశం భారతదేశానికి ఒక ముఖ్యమైన ముఖద్వారంగా పనిచేస్తోంది. ఈ పర్యటన ద్వారా ఇంధనం, మౌలిక సదుపాయాలు, సేవల వాణిజ్యంలో పెట్టుబడులు మరింత పటిష్టం కానున్నాయి.

**నెదర్లాండ్స్,** ఇటలీలి దేశాలతో క్లీన్ టెక్నాలజీస్, బ్లూ ఎకానమీ మరియు స్థిరమైన సప్లై చైన్ ఏర్పాటుపై చర్చలు జరగనున్నాయి. ఇది ఫార్మాస్యూటికల్స్, టెక్స్టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మేలు చేస్తుంది.

**ఓస్లో (నార్వే)** లో జరిగే భారత్-నార్డిక్ శిఖరాగ్ర సదస్సు పునరుత్పాదక ఇంధనం, వాతావరణ సాంకేతికతలు, సముద్ర రంగాలలో పరస్పర సహకారానికి ఒక అద్భుతమైన వేదిక కానుంది.'యూరోపియన్ రౌండ్ టేబుల్ ఫర్ ఇండస్ట్రీ' లో ప్రధాని పాల్గొనడం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచుతుంది. ఎఫ్ ఐఈఓ ఈ పర్యటనను ఒక సువర్ణావకాశంగా పేర్కొంది.

# మరోమారు తెరపైకి ఫార్ములా-ఈ రేస్ కేసు

మొదటి తరువాయి

ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఆయనతో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3 హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్‌రావుకు సమన్లు జారీ అయ్యాయి. జులై 31న విచారణకు రావాలని కోర్టు ఆదేశించింది. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ అభియోగపత్రంలో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలతో సహా ఎఫ్ఈఓ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించింది. ఫార్ములా-ఈ కారు రేసు నిర్వహణలో జరిగిన అక్రమాలపై ఏసీబీ ఇప్పటికే లోతైన దర్యాప్తు జరిపి అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా మాజీ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ పేర్కొంది. వీరితో పాటు ఏ4గా స్పోర్ట్స్ కన్స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా ఎఫ్ఈఓ సంస్థపై కేసులు నమోదయ్యాయి. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా-ఈ రేసు కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు నిధులు మళ్లించారన్నదే ప్రధాన అభియోగం. హెచ్ఎండీఏ ఖాతా నుంచి సుమారు 55 కోట్ల రూపాయలను ఎఫ్ఈఓ సంస్థకు బదిలీ చేసినట్లు ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. ముందస్తు అనుమతులు లేకుండానే ఇంత భారీ మొత్తాన్ని విదేశీ సంస్థకు ఎలా చెల్లించారన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అరవింద్ కుమార్ సహా పలువురు ప్రతినిధులను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఏసీబీ కోర్టు ఈ కేసును విచారణకు స్వీకరించి సమన్లు జారీ చేయడంతో.. జూలై 31న కోర్టులో ఏం జరగబోతుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.

# ఆదా చేద్దాం.. ఇంధనం!

మొదటి తరువాయి

ఆంధ్రప్రదేశ్‌లో సగానికి తగ్గుతున్న కాన్వాయ్‌లు..

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమ భద్రతా వాహనాల శ్రేణిని (కాన్వాయ్) గణనీయంగా తగ్గించుకోవాలని నిర్ణయించారు. సాధారణంగా ముఖ్యమంత్రులు, మంత్రులు పర్యటించే సమయంలో పెద్ద సంఖ్యలో వాహనాలు వెంట రావడం సహజం. అయితే ఇకపై జిల్లాల్లో పర్యటించేటప్పుడు తమ కాన్వాయ్‌లలో ఉండే వాహనాల సంఖ్యను 50 శాతానికి తగ్గించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

కేవలం వీరు మాత్రమే కాకుండా, మంత్రులు, ఇతర వీవీఐపీలు కూడా సాధ్యమైనంత తక్కువ వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక ప్రభుత్వ కార్యాలయాల్లో పగటి సమయంలో ఏసీలు వేయరాదని ఆదేశాలిచ్చారు. సోలార్ పవర్‌తో నడిచే కార్యాలయాలకు మినహాయింపు ఇచ్చారు. ఇక ఉన్నతస్థాయి ఉద్యోగులు షేరింగ్ కార్లను మాత్రమే వినియోగించాలని కోరారు. సాధ్యమైనంతవరకు కార్యాలయాలకు వచ్చేందుకు ప్రజా రవాణా వ్యవస్థను



వినియోగించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

**పవన్ కళ్యాణ్ సైతం...**

ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పొదుపు చర్యలు పాటిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని, అదే బాటలో రాష్ట్రంలోనూ ఈ విధానాన్ని కొనసాగించాలని పవన్ కళ్యాణ్ తన కార్యాలయం ద్వారా వెల్లడించారు. ఈ నిర్ణయం పట్ల సోషల్ మీడియా వేదికగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గురువారం జరగనున్న క్యాబినెట్ భేటీలో ఈ పొదుపు చర్యలకు సంబంధించి మరిన్ని కీలక విధాన నిర్ణయాలు ప్రకటించే అవకాశం ఉంది.

సీఎం రేవంత్ రెడ్డి కూడా..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తన కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను కుదించుకోవాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయన కాన్వాయ్‌లో సుమారు 9 వాహనాలు ఉండగా, వాటిని 4 నుంచి 5 వాహనాలకు పరిమితం చేసేలా కసరత్తు చేయాలని భద్రతా విభాగం పోలీసు అధికారులకు సూచించినట్లు సమాచారం. ఆయన తన నివాసం నుంచి ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీకి వెళ్లే క్రమంలో కేవలం మూడు వాహనాలతోనే ప్రయాణించడం ద్వారా తన సంకల్పాన్ని చాటుకున్నారు. ఈ అంశంపై రాబోయే రెండు రోజుల్లో స్పష్టత రానుంది, తద్వారా మంత్రుల కాన్వాయ్‌లలో కూడా వాహనాల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.

# ఆరోగ్యానికి ఈత కొలనులు అవసరం

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హస్తినాపురం, మే 14 (నేటి దర్శిని):** హస్తినాపురం డివిజన్ పరిధిలోని జయకృష్ణ ఎంక్లేవ్‌లో నిర్మాణంలో ఉన్న ఆధునిక స్విమ్మింగ్ పూల్ పనులను దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఈత కొలనులకు రోజురోజుకు డిమాండ్ పెరుగుతోందని పేర్కొన్న ఆయన, ఆరోగ్య పరిరక్షణ కోసం పిల్లలు, యువత, మహిళలు ఈతపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఈత వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కూడా లభిస్తుందని నిపుణులు సూచిస్తున్నారని తెలిపారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ స్థానికుల నుంచి వస్తోందని చెప్పారు. నిర్మాణంలో ఉన్న ఈ స్విమ్మింగ్ పూల్‌లో డ్రెస్సింగ్ రూములు, ఫిల్టరేషన్ ప్లాంట్, వెయిటింగ్ హాల్, కోచ్ గది వంటి ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. జీహెచ్ఎంసీ పరిధిలో నిర్మించిన 15 స్విమ్మింగ్ పూల్స్‌లో మూడు ఎల్.బి.నగర్ నియోజకవర్గానికి తీసుకురావడం జరిగిందని, అందులో రెండు ఇప్పటికే ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, మరొకటి నిర్మాణ దశలో ఉందని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్స్ ఎక్కువగా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లకే పరిమితమై ఉండగా, ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో మాత్రం ప్రత్యేక ప్రాంతాల వారీగా అన్ని సౌకర్యాలతో స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలో పార్కులు, ప్లే గ్రౌండ్లు మరియు ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆందోజు సత్యంచారి, చింతల రవికుమార్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ..



**ఆమనగల్లు,మే14(నేటి దర్శిని):** ఆమనగల్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రాథమిక వ్యవసాయ సంఘం ఆమనగల్ (సబ్ కౌంటర్) ముద్విన్ గ్రామంలో మరియు నాగిల్ల ఐకెపి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులకు టోకెన్ పద్ధతిలో ఇస్తున్న రికార్డులను తనిఖీ చేసి అక్కడ ఉన్న రైతులను అడిగి వివరాలను,వడ్ల కొనుగోలు ఏ విధంగా జరుగుతుంది అని ఆ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ యాట గీత నరసింహ,మార్కెట్ డైరెక్టర్ తాళ్ల రవీందర్ లు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల నుండి ప్రతి గింజ వరకు కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉంది అని ప్రతి రైతు ప్రభుత్వం కేటాయించిన కేంద్రాలలోనే ధాన్యాన్ని అమ్మి సన్నవోడ్లు క్వింటాలుకు రూ:2400 ఇస్తుందని పైగా బోనస్ 500 రూపాయల ను క్వింటాలుకు ఇస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి,జల్లా రమేష్ గౌడ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## 10 వ వార్డు కౌన్సిలర్ కె. అనిత శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్స్...



**ఆమనగల్లు,మే14(నేటి దర్శిని):** ఆమనగల్లు మునిసిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి లో 10వ వార్డు కౌన్సిలర్ కోగూరి అనిత శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. క్రికెట్ ఆడే 8 టీములకు (120 మందికి) పదవ వార్డు బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శంకర్ నాయక్ టోపీలను సమకూర్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోగురి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కృష్ణా నాయక్, మరియు రామచందర్, విఠాయిపల్లి గ్రామ యువకులు,ముఖ్య నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది-మంత్రి శ్రీధర్ బాబు

● ప్రతి గ్రామంలో దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం-కొండా సురేఖ
● రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం




**నాగోల్, మే14 (నేటి దర్శిని):** తెలంగాణ రాష్ట్రంలోని బ్రాహ్మణుల అభ్యున్నతి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర సమాచార సాంకేతిక మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, అటవీ దేవాదాయ శాఖల మంత్రి కొండ సురేఖలు పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ వసంత విహార్‌లో బాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వారు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అధ్యక్షుడు బసవరాజు శ్రీనివాస్ , ఉపాధ్యక్షుడు పొన్నాడ సుబ్రహ్మణ్యం ల చే ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ... సమాజంలోని అన్ని వర్గాల మాదిరిగానే బ్రాహ్మణుల్లో కూడా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ఉన్నాయని, అలాంటి నిరుపేద కుటుంబాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ద్వారా సమాజానికి సేవ చేసే వారిని సభ్యులుగా ఎంపిక చేసి పరిషత్తును మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. అర్చక వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల సంక్షేమం కోసం రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో దేవాలయాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం మూడు వందల కోట్ల రూపాయల నిధులను కేటాయించిందని వెల్లడించారు. బ్రాహ్మణ సంఘాలు, ఉపవర్గాలు అన్నీ ఏకతాటిపైకి వచ్చి పరిషత్తుకు సహకరించాలని వారు సూచించారు. గత ప్రభుత్వం కూడా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తును ఏర్పాటు చేసినప్పటికీ తగిన ప్రోత్సాహం, నిధులు అందించలేకపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్చకుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బసవరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి మహేష్ కుమార్ గౌడ్ , మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖలకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని, రాష్ట్రంలోని ప్రతి బ్రాహ్మణ కుటుంబానికి అండగా నిలుస్తానని తెలిపారు. పేద బ్రాహ్మణులకు ఆర్థిక, విద్యా, వైద్య సహాయాన్ని అందించేందుకు ప్రత్యేక సహకార సంఘాన్ని ఏర్పాటు చేస్తామని, నివాస సౌకర్యం లేని నిరుపేదలకు తక్కువ ఖర్చుతో గృహ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యక్షుడు పొన్నాడ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి, చల్లా నరసింహారెడ్డి , ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలరావు , కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి , తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా , అధికార ప్రతినిధి శ్రీ సత్యం శ్రీరంగం, తో పాటు కాంగ్రెస్ నాయకులు, ఈ కార్యక్రమాన్ని బ్రాహ్మణుల సంఘం బాస్ సభ్యులు ఒక్కలంక శ్రీనివాస్, రాష్ట్రంలోని వివిధ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చంపాపేట్‌లో ఘనంగా ప్రారంభమైన ఏవీఎస్ కిడ్స్ ప్లే జోన్

● ప్రారంభించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు



**చంపాపేట్; మే 14 (నేటి దర్శిని):** చంపాపేట్ ప్రాంతంలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన “ఏవీఎస్ కిడ్స్ ప్లే జోన్”ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ప్లే జోన్‌ను ప్రారంభించి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వెంకటేష్, అభిలాష్ గౌడ్, సాయినాథ్ గౌడ్ మాట్లాడుతూ చిన్నారుల వినోదంతో పాటు వారి మానసిక వికాసానికి దోహదపడే విధంగా ఆధునిక ఆటపరికరాలు, సురక్షిత వాతావరణంతో ప్లే జోన్‌ను రూపొందించినట్లు తెలిపారు. పిల్లలు ఆనందంగా గడిపేలా అన్ని సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, యువకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు.

# ఘనంగా ఎంఆర్పీఎస్ నేత బొడ్డు శివ జన్మదిన వేడుకలు..

● బొడ్డు శివకు ఆశీస్సులందించిన మంద కృష్ణ మాదిగ



**నాచారం, మే 14(నేటి దర్శిని):** ఎంఆర్పీఎస్ నాచారం డివిజన్ నాయకుడు బొడ్డు శివ అద్వైత్ మాదిగ జన్మదినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకుడు, ఉప్పల్ ఇంచార్జి కోరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ను వారి నివాసంలో కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ, బొడ్డు శివ అద్వైత్ మాదిగ సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. యువ నాయకులు సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ జాతీయ నాయకులు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, మేడ్చల్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఎల్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# హార్దిక్ పటేల్ పుట్టినరోజు సందర్భంగా పేదలకు అల్పాహార పంపిణీ

● కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం







**ఎల్.బి.నగర్, మే 14 (నేటి దర్శిని):** సిద్ధిపేటకు చెందిన హార్దిక్ పటేల్ పుట్టినరోజు సందర్భంగా గురువారం కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో పేదల మురికివాడలో అల్పాహార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి హార్దిక్ పటేల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవ సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, “ఈ మండుటెండలో కూడా పేద ప్రజలకు సేవ చేస్తున్న మా సంస్థ సభ్యులు, అధికారులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. భగవంతుడు వారందరి కోరికలను నెరవేర్చాలి” అని ఆకాంక్షించారు. ఈ సేవా కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవ సమితి కోశాధికారి కుష్ అగర్వాల్‌తో పాటు సభ్యులు సంజయ్ ధనావత్, సునీల్ దరాడే, ఆకాష్ ధావలే, ఎం. స్వామి తదితరులు పాల్గొని హార్దిక్ పటేల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# నల్గొండ చర్లపల్లి ఫ్లైఓవర్‌పై ఘోర ప్రమాదం..


● అక్కడికక్కడే యువకుడు మృతి
● ఆర్టీవో తనిఖీల భయంతో లారీ వేగం



**నల్గొండ, మే 14 (నేటి దర్శిని):** నల్గొండ జిల్లా చర్లపల్లి ఫ్లైఓవర్ బైపాస్ సమీపంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాజస్థాన్‌కు చెందిన లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం తీవ్రతకు ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమైంది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతుడిని నాగార్జునసాగర్ మండలం చలకుర్తి గ్రామానికి చెందిన బొల్లం లింగయ్యగా గుర్తించారు. స్థానికుల కథనం ప్రకారం, ఆర్టీవో వాహన తనిఖీలను తప్పించుకునేందుకు లారీ కంటైనర్ డ్రైవర్ వేగంగా వెళ్లే ప్రయత్నంలో ఈ ప్రమాదం జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## సంపాదకీయం

# ట్రంప్ బీజింగ్ పర్యటన



డోనాల్డ్ ట్రంప్ బీజింగ్ పర్యటన ఏ ఫలితాలు సాధిస్తుందో? ఏ పర్యవసానాలకు నాంది పలుకుతుందో? ఇప్పుడైతే తెలియదు గానీ పెద్ద ఎత్తున మీడియా కేంద్రీకరణ మాత్రం జరిగింది. భిన్న కోణాల్లో విశ్లేషణలు వెలువడ్డాయి. చైనాకు ట్రంప్ ఎక్కడ లొంగిపోతాడో అన్న ఆందోళన, హెచ్చరికలు, కమ్యూనిస్టు దేశంతో సంబంధాలకు బాటవేసిన నాటి అధ్యక్షుడు నిక్సన్ తరువాత ఇతర నేతలు సాధించలేని దాన్ని ట్రంప్ సాధిస్తాడా? ఇలా పరిపరి ఆలోచనలు, ఆశలు వెల్లడయ్యాయి. ఎనభయ్యవ పడికి దగ్గరలో ఉన్న ట్రంప్ వ్యవహారశైలి ప్రకారం ఎందుకు, ఎప్పుడేం మాట్లాడతాడో తెలియదు. ఇరుదేశాల నేతల మధ్య అనేక అంశాల మీద తీవ్ర విబేధాలు, అనుమానాలు ఉన్నప్పటికీ ఎవరూ తెగేదాకా లాగటం లేదు. అందితే జుట్టు అందకపోతే కాళ్లు అన్న చందంగా వ్యవహరించే ట్రంప్ చైనా అధినేత షీ జిన్‌పింగ్ గురించి చేసిన వ్యాఖ్యలు ఆసక్తి కలిగించాయి. "మీరు గొప్పనేత, నేను ఇలా చెప్పటాన్ని కొన్నిసార్లు జనాలకు నచ్చకపోవచ్చు, అయితే నేను ఎలా గైనా చెబుతాను. ఎందుకంటే ఇది నిజం, మీతో కలవటం ఒక గౌరవం, మీ స్నేహితుడిగా ఉండటం ఒక గౌరవం, గతం కంటే రెండు దేశాల సంబంధం భవిష్యత్‌లో ఎంతో మెరుగ్గా ఉండబోతున్నది " అని ట్రంప్ ఉబ్బేశాడు. డోనాల్డ్ ట్రంప్-నరేంద్రమోడీ తమ మధ్య ఉన్న బంధం గురించి ఎలా మాట్లాడుకున్నారో తెలిసిందే. ఇక్కడ గమనించా ల్సిందేమంటే ఇలాంటి బిస్కెట్లకు పడిపోయే రకం కాదు షీ జిన్‌పింగ్ అని చెప్పకతప్పదు. మెత్తమెత్తగానే తమ ధృడవైఖరిని వెల్లడించటం దౌత్యంలో తలపండిన చైనా నేతలు పొగడ్తలకు పొంగిపోరు, బెదిరింపులకు లొంగిపోరు అన్నది ఇరు దేశాల సంబంధాలు ప్రారంభమైన 1972 నుంచీ చరిత్ర చెప్పిన సత్యం. తైవాన్ సమస్యలో అమెరికా వ్యవహరించే తీరు తెన్నులు సంఘర్షణలకు దారితీయ గలవని, అది రెండు దేశాల మధ్య ఉన్న మొత్తం సంబంధాన్ని పెను ప్రమాదంలో పడవేయగలదని గురువారం నాడు షీ జిన్‌పింగ్ స్పష్టం చేశాడు. రెండు గంటల పాటు బీజింగ్ గ్రేట్ హాల్లో భేటీ తరువాత చైనా విదేశాంగశాఖ ప్రతినిధి అధికారికంగా వెల్లడించిన సమాచారమిది. మొహమాటానికి పోతే ఏదో అయిందన్న సామెత తెలిసిందే. అంత్య నిష్టూరం కన్నా ఆదిలోనే చెప్పటం మేలన్నట్లుగా తైవాన్ విషయంలో చైనా నేతలు ఎప్పుడు మాట్లాడినా ఇదే స్పష్టతతో ఉన్నారు. స్థిరపడిన ఒక అధికార శక్తి, ఎదుగు తున్న మరొక శక్తిని తొలగిస్తా మని బెదిరిస్తే ఫలితం తరచుగా యుద్ధాలకు దారితీస్తుం దని పురాతన గ్రీకు చరిత్ర కారుడు చెప్పిన అంశాన్ని జిన్‌పింగ్ దౌత్య పరిభాషలో చెప్పారు. ఇది చైనా 'అమెరికా' ఇరాన్ పరిణామాలకే కాదు, ఎవరికైనా వర్తించేదే. మరోసారి అమెరికాను గొప్పగా చేస్తానని గతంలో ట్రంప్ ఇచ్చిన నినాదం మరొక దేశాన్ని ఎదగనిచ్చేది లేదని చెప్పటం తప్ప మరొకటి కాదు. డ్రాగన్ దేశంలో స్థిరత్వాన్ని సాధించేందుకు మరీ ఎక్కువ రాయితీలు ఇవ్వొద్దంటూ అమెరికా మేధావులు ట్రంప్‌ను హెచ్చరించారు. అమెరికాకు చైనా ఎంతదూరమో, చైనాకూ అమెరికా అంతే. ఇచ్చిపుచ్చుకోవటం తప్ప ఏదో ఒకవైపే అంతా ఉండాలంటే కుదరదు. అందుకే ఎవరికి వీలున్న రంగాలను వారు ప్రత్యర్థులతో బేరసారాలకు వినియోగించుకుం టున్నారు. తాజాగా ట్రంప్ అమెరికాలోని కార్పొరేట్ దిగ్గజాలను వెంటేసుకొని వెళ్లారు తప్ప చైనా నేతలు గతంలో అలాంటి పర్యటనలు జరపలేదు. దీని అర్థం ఏమిటంటే పెద్ద మొత్తంలో వాణిజ్య మిగులుతో బీజింగ్ అనుకూల స్థితిలో ఉంది. అమెరికా అడుక్కొనేదిగా ఉండాలి తప్ప బెదిరిస్తే కుదరదు. 1970 దశకంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన చీలికలు సోవియట్-చైనా దేశాల మధ్య విబేధాలకు దారితీశాయి. ఈ పూర్వరంగంలో చైనాను దగ్గరకు తీసి ముందుగా సోవియట్‌ను, తరువాత చైనానూ దెబ్బకొట్టాలన్నది అమెరికా దుష్టాలోచన. ఇదే సమయంలో సోవియట్ తో తలెత్తిన విబేధాలతో నిలిచిపోయిన అనేక ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల అవసరం కూడా చైనాకు ఏర్పడింది. అందుకే డెంగ్ సియావో పింగ్ నాయకత్వంలోని పార్టీ సంస్కరణలకు తెరతీసింది. అరబ్బు వ్యాపారి, ఒంటె కథలో ముందు గుడారంలో దూరి వ్యాపారిని బయటకు నెట్టేసిన ఒంటె మాదిరి చైనా కమ్యూనిస్టు వ్యవస్థను కూల్చివేయాలని అమెరికా దురాలోచన చేసింది. అయితే అనుకున్నది ఒకటి అయింది ఒకటి అన్నట్లుగా అమెరికా ఒకందుకు ముందుకు వస్తే చైనా మరొకందుకు వచ్చిన అవకాశాన్ని వినియోగించు కొని ఇప్పుడు అమెరికానే అనేక రంగాల్లో సవాలు చేసే స్థితికి ఎదిగింది. సోషలిస్టు వ్యవస్థను కూల్చివేయాలన్న నిక్సన్ ఆలోచనలను తరువాత వచ్చిన వారెవరూ నెరవేర్చ లేకపోయారని ఇప్పుడు ట్రంప్ అయినా ఆ పని పూర్తి చేస్తాడా? అంటూ కొందరు దింపుడు కల్లం ఆశతో వ్యాఖ్యానాలు చేస్తున్నారు. తియన్మెన్ స్క్వేర్ ఉదంతం ఆ కుట్రలో భాగమే, దాన్ని తిప్పికొట్టిన చైనా మరిన్ని జాగ్రత్తలు తీసుకుంది గనుక ఇప్పటికైతే అది పగటి కలే అని చెప్పక తప్పదు. ఇద్దరు నేతల మధ్య బీజింగ్‌లో చర్చకు వచ్చిన అంశాలు, వాటి తీరుతెన్నులు ఇంకా పూర్తిగా వెలువడలేదు. చైనా వెళ్లి ఏదో ఒకటి సాధించుకురావాలన్నది ట్రంప్ యంత్రాంగ గట్టి వాంఛ. అందుకే చైనాలో పెట్టుబడులకే మొగ్గు చూపుతున్న తమ కార్పొరేట్లను సంతుష్టీకరించేం దుకు ట్రంప్ పాట్లు పడుతున్నాడు, అది జరుగుతుందా!

# అరవింద్ కేజ్రీవాల్‌కు షాక్..

**కోర్టు ధిక్కార చర్యలకు సిద్ధమైన ఢిల్లీ హైకోర్టు**



**న్యూఢిల్లీ, మే 14 (నేటి దర్శిని)**
ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు షాకిచ్చింది. ఆయనపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. సెక్షన్ 2సీ ప్రకారం కేజ్రీవాల్‌పై కోర్టు ధిక్కార క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఆదేశాలు జారీ చేశారు. కేజ్రీవాల్‌తోపాటు ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేతలు మనీష్ సిసోడియా, దుర్గేష్? పాఠక్, సౌరభ భరద్వాజ్, సంజయ్ సింగ్‌పై కూడా చర్యలకు ఆదేశించింది. ఈ చర్యలు ఢిల్లీ లిక్కర్ కేసుకు సంబంధించినవి. ఈ కేసు విచారణకు సంబంధించిన వీడియోను ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. అలాగే, ఈ కేసును విచారించిన జస్టిస్ స్వర్ణకాంత శర్మపై పలు ఆరోపణలు చేశారు. ఆమె ముందు తాము విచారణకు హాజరుకామని తేల్చిచెప్పారు. దీంతో కేజ్రీవాల్ సహా వీడియోలు షేర్ చేసిన వారిపై క్రిమినల్ చర్యలకు కోర్టు సిద్ధమైంది. వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఈ సందర్భంగా జస్టిస్ స్వర్ణకాంత శర్మ స్పందించారు. తనతోపాటు కోర్టును కూడా బెదిరించేందుకు వారు ప్రయత్నించారని జస్టిస్ శర్మ అన్నారు. తన పరువుకు నష్టం కలిగించేలా వ్యవహరించారని, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారని విమర్శించారు. న్యాయపరమైన అంశాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లారని శర్మ అన్నారు. ఎడిటెడ్ వీడియోలతో తన కుటుంబ సభ్యుల్ని కూడా ఇబ్బంది పెట్టినట్లు ఆమె చెప్పారు. అయితే, తనను ఎవరూ బెదిరించలేరని వ్యాఖ్యానించారు. ఒక అబద్ధాన్ని వెయ్యిసార్లు చెప్పినంత మాత్రాన అది నిజం కాదని, తాను ఈ విషయంలో ఎంతమాత్రం మౌనంగా ఉండబోనని ఆమె వ్యాఖ్యానించారు.

# లాయర్ అవతారమెత్తిన మమత..

**-ఎన్నికల అనంతర హింస కేసులో వాదనలు**



**న్యూఢిల్లీ, మే 14 (నేటి దర్శిని)**
పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి లాయర్ అవతారం ఎత్తారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే తమ పార్టీ నేతలు, కార్యకర్తలు, పార్టీ కార్యాలయాలపై అధికార బీజేపీ పాల్పడిన దాడులకు సంబంధించిన కేసులో స్వయంగా వాదించడానికి నల్లకోటు ధరించి గురువారం ఆమె కలకత్తా హైకోర్టుకు వచ్చారు. ఆమె వెంట పార్టీ సీనియర్ నేతలు చంద్రిమా భట్టాచార్య, కల్యాణ్ బెనర్జీ తదితరులు వచ్చారు.
ఎన్నికల అనంతరం తమపై జరిగిన హింసపై టీఎంసీ తరపున న్యాయవాది శీర్షాన్య బందోపాధ్యాయ ఈ నెల 12న పిల్ దాఖలు చేశారు. పలువురు టీఎంసీ కార్యకర్తలపై దాడులు జరిగాయని, బలవంతంగా వారిని ఇండ్ల నుంచి గెంటేశారని వారు తమ పిటిషన్‌లో ఆరోపించారు.

**మమత లాయర్ వృత్తి వివరాలు కోరిన బీసీఐ**


తమ కార్యకర్తలపై దాడిపై టీఎంసీ దాఖలు చేసిన కేసులో వాదించడానికి స్వయంగా ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ న్యాయవాదిగా కలకతా హైకోర్టుకు హాజరైన క్రమంలో లాయర్‌గా ఆమె కేసు వాదించడానికి అర్హురాలేనా అన్న ప్రశ్నలు తలెత్తాయి. దీంతో మమత ఎప్పుడు న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు, ప్రాక్టీస్ తదితర వివరాలు 48 గంటల్లోగా తమకు సమర్పించాలని పశ్చిమ బెంగాల్ బార్ కౌన్సిల్‌ను భారత బార్ కౌన్సిల్ (బీసీఐ) కోరింది. నిబంధనల ప్రకారం రాజ్యాంగ పదవిని నిర్వహించే లేదా వేతనంతో కూడిన ఉద్యోగంలో ఉన్న వ్యక్తి తన సేవా కాలంలో బార్ లైసెన్స్‌ను నిలిపివేయించుకోవాల్సి ఉంటుంది

# కేరళ ప్రతిపక్షనేతగా పినరయి విజయన్ ఏకగ్రీవం




**హైదరాబాద్: మే 14 (నేటి దర్శిని)**
సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. కేరళ శాసనసభలో ప్రతిపక్షనేతగా పినరయి విజయన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. గురువారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశానికి పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.బేబీ, ఏ.విజయరాఘవన్,పినరయి విజయన్‌తో పాటు ఇతర నాయకులు హాజరయ్యారు. కమిటీ నిర్ణయాలను ఆ రాష్ట్ర CPI(M) రాష్ట్ర కార్యదర్శి గోవిందన్ తెలియజేశారు. పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, ఎల్డీఎఫ్ తరుపున అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా పినరయి ప్రజా సమస్యలపై ప్రశ్నించనున్నారని ఆయన వెల్లడించారు. కాగా యూడీఎప్ తరుపున కాంగ్రెస్ వీడీ. సతీశన్‌ను సీఎం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. గత నెలల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో యూడీఎప్ 102 సీట్లు సాధించిగా ౹ాణఖీ 35 స్థానాలు గెలుచుకుంది.

# ఫతహ్-4 క్రూయిజ్ క్షిపణిని పరీక్షించిన పాకిస్థాన్



**ఇస్లామాబాద్ మే 14 (నేటి దర్శిని)**
ఫతహ్-4 క్రూయిజ్ మిస్సైల్ ను పాకిస్థాన్ విజయవంతంగా పరీక్షించింది. స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని డెవలప్ చేశారు. లాంగ్ రేంజ్ టార్గెట్లను ఇది పేల్చగలదని పాక్ ఆర్మీ చెప్పింది. రాకెట్ ఫోర్స్ కమాండ్ ఈ క్షిపణిని పరీక్షించినట్లు ఐఎస్పీఆర్ ఓ ప్రకటనలో తెలిపింది. అడ్వాన్స్‌డ్ ఏవియానిక్స్, నేవిగేషన్ తో దీన్ని రూపొందించారు. సైనిక బలగాల సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ క్షిపణిని పరీక్షించినట్లు ఆర్మీ చెప్పింది. దేశాధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి, ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ .. ఆ క్షిపణి పరీక్ష పట్ల ప్రశంసలు కురిపించారు. గత నెలలో పాక్ ఆర్మీకి చెందిన రాకెట్ ఫోర్స్ కమాండ్.. ఫతహ్-2 మిస్సైల్ సిస్టమ్‌ను పరీక్షించిన విషయం తెలిసిందే. 2025 సెప్టెంబర్‌లో క్రూయిజ్ మిస్సైల్ ఫతహ్-4 ట్రైనింగ్ లాంచ్ చేసింది. ఫతహ్-4 సుమారు 750 కిలోమీటర్ల దూరంలో ఉన్న టార్గెట్‌ను ధ్వంసం చేయగలదు. గత ఏడాది మే నెలలో కూడా ఫతహ్ సిరీస్‌కు చెందిన సర్ఫేస్ టు సర్ఫేస్ క్షిపణిని పాక్ ఆర్మీ పరీక్షించింది.


# కరువు భత్యం 2 శాతం పెంచిన విజయ్ సర్కార్



**చెన్నై,మే 14 (నేటి దర్శిని)**
తమిళనాడులో సీఎం విజయ్ సర్కార్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగుల కరువు భత్యాన్ని 2 శాతాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు అందుకుంటున్న డీఏ 58 శాతం నుంచి 60 శాతానికి సవరిస్తున్నామని, ఇది ఈ ఏడాది జనవరి 1 వర్తిస్తుందని ఆదేశాల్లో పేర్కొన్నది. అలాగే మద్యం అమ్మకాల్ని నియంత్రిస్తూ సీఎం విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో 21 ఏండ్ల వయసు నిబంధనను కఠినంగా అమలుజేయాలని ఆదేశాలు జారీ చేశారు.

# గాల్లోకి మనుషులు ఎగిరిపోయేంతగా!

**ఉత్తర ప్రదేశ్‌లో ఈదురు గాలుల బీభత్సం.. 104 మంది మృతి**



**న్యూఢిల్లీ, మే 14 (నేటి దర్శిని)**
దేశంలో రెండు విభిన్న వాతావరణ ధోరణలు నెలకొన్నాయి. ఓవైపు దేశమంతటా వేసవి ఎండలు దంచి కొడుతుండగా.. మరోవైపు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో ఈదురుగాలులు, అకాల వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. దీంతో యూపీలోని ప్రయాగ్‌రాజ్, అయోధ్య సహా 31 జిల్లాల్లో గురువారం 104 మంది మృత్యువాత పడ్డారు. ఒక్క ప్రయాగ్‌రాజ్ జిల్లాలోనే 21 మరణాలు చోటుచేసుకోగా, బదోహీలో 17 మంది మృతిచెందారు. బరేలీ జిల్లాలో 80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయడంతో ఓ యువకుడు ఇనుపరేకు సహా గాలిలోకి ఎగిరి కొంతదూరంలోని పొలాల్లో పడిపోయినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కొన్ని చోట్ల భారీ వృక్షాలు, విద్యుత్తు స్తంభాలు కూలి వాహనాలపై పడటం, పట్టణాల్లోని దుకాణాల పైనున్న రేకులు ఎగిరి పడటంతో పలువురు మృతి చెందగా, 53 మంది వరకు గాయపడినట్టు యూపీ రిలీఫ్ కమిషనర్ వెల్లడించారు. వర్షం, ఈదురుగాలుల కారణంగా వందకుపైగా పశువులు కూడా మరణించినట్టు తెలిపారు. భారీస్థాయిలో ఆస్తినష్టం సంభవించిట్టు అంచనా వేస్తున్నారు. మరోవైపు రాజస్థాన్‌లో వడగాలులు పౌరులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

# ప్రజా ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం..

● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి...



**ఆమనగల్లు,మే14(నేటి దర్శిని);**
ఆమనగల్ పట్టణంలోని కళ్యాణి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో గురువారం కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో ఆమనగల్లు మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామ సర్పంచ్ నేలపట్ల నరేందర్ రెడ్డి,మరియు ఉప సర్పంచ్,వార్డు మెంబర్లు,కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తోని అభివృద్ధి సాధ్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రము అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సర్పంచ్ నేలపట్ల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ లో చేరుతున్నామనీ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నేతృత్వంలో పనిచేస్తామని అన్నారు. అలాగే గ్రామానికి 50 ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని సర్పంచ్ నేలపట్ల నరేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్, కౌన్సిలర్లు కోగూరి అనిత శ్రీనివాస్ రెడ్డి,కో ఆప్షన్ మెంబర్ ఎండి అబ్దుల్ ఖాదర్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, మండల పార్టీ అధ్యక్షుడు తెలుగమల్ల జగన్,మానయ్య, యాట నరసింహ, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథును వెంటనే అరెస్టు చేయాలని బిఆర్ఎస్ నాయకుల భారీ ర్యాలీ...






**ఆమనగల్లు,మే14(నేటి దర్శిని);**
ఆమనగల్లు పట్టణంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో కేంద్ర హోమ్ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథును వెంటనే అరెస్టు చేయాలని గురువారం భారీ ర్యాలీ ని నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ లు మాట్లాడుతూ మైనర్ బాలికను లైంగికంగా వేధింపులకు గురిచేసిన కేసులో కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథులు వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వెంటనే క్షమాపణ చెప్పి కేంద్ర మంత్రి పదవికి బండి సంజయ్ రాజీనామా చేయాలని వారన్నారు. సామాన్యులకు ఒక న్యాయం రాజకీయ అండతో పలుకుబడి కలిగిన ప్రజాప్రతినిధులకు ఒక న్యాయమా అంటూ నినాదాలు చేశారు. బిఆర్ఎస్ కార్యకర్తలతో మహిళలతో కలిసి పెద్ద ఎత్తున హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారి గుండా నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, నాగిళ్ల జగన్, ఎనుముల రమేష్, ఎంగలి భాగ్యలక్ష్మి, పుల్లారెడ్డి అనూష, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్, సైదులు గౌడ్, జంతుక కిరణ్, సతీష్, అమృతం పాండు, గుజ్జరి గోపి, గుద్దేటి మహేష్ నేత, వడ్డే వెంకటేష్, ఎంగలి రఘు, తదితరులు పాల్గొన్నారు

# మోడల్ స్కూళ్లలో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

● మే 25 వరకు దరఖాస్తు గడువు



**హైదరాబాద్, మే 14 (నేటి దర్శిని):**
రాష్ట్రంలోని 194 తెలంగాణ మోడల్ స్కూళ్లలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఆసక్తి మరియు అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 25వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్స్ అదనపు సంచాలకుడు శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి మార్కుల ఆధారంగానే సీట్లు ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఎలాంటి ప్రవేశ పరీక్ష ఉండదని, విద్యార్థులకు పదో తరగతి లో వచ్చిన మార్కుల ఆధారంగానే సీట్లను కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నుంచి ఎంపిక చేసిన విద్యార్థుల మొదటి జాబితాను ఈ నెల 27వ తేదీన ఆయా పాఠశాలల్లో అధికారికంగా ప్రకటిస్తారు.

**కొత్తగా 'ఏ.సీ.ఈ' గ్రూపు ప్రవేశపెట్టడం విశేషం**
ఈ విద్యా సంవత్సరం నుంచి మోడల్ స్కూళ్లలో కీలక మార్పులు చేశారు. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న ఎంఈసీ గ్రూపు స్థానంలో కొత్తగా ఏసీఈ (అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్) గ్రూపును పరిచయం చేస్తున్నారు. సాంప్రదాయ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు యథాతథంగా కొనసాగుతాయి. అయితే, ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఉన్న విద్యార్థులకు మాత్రం పాత ఎంఈసీ గ్రూపే కొనసాగుతుందని ఆయన వివరించారు.

**జూన్ 1 నుంచి క్లాసులు.. యాంటీడ్రగ్ హామీపత్రం తప్పనిసరి..!**
ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు జూన్ 1వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులను మాదకద్రవ్యాల బారిన పడకుండా రక్షించేందుకు ప్రభుత్వం ఈసారి సరికొత్త నిబంధనను తెచ్చింది. తెలంగాణ ఇంటర్ బోర్డు ఆదేశాల ప్రకారం.. అడ్మిషన్ల సమయంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి యాంటీడ్రగ్ అఫిడవిట్ (హామీపత్రం) తీసుకోవాలని ప్రిన్సిపాళ్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు పాటించి గడువులోగా దరఖాస్తులు పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

# సర్కారీ చదువు.. ప్రగతికి మెట్టు..






● రాజీవ్ గాంధీ నగర్ స్కూల్‌లో ఘనంగా ప్రతిభా పురస్కారాలు
● రాక్‌టౌన్ కాలనీ అధ్యక్షులు ఎర్ర వినోద్ ఆధ్వర్యంలో 'బడిబాట'.. విద్యార్థులతో భారీ ర్యాలీ

**ఎల్బీనగర్, మే14 (నేటి దర్శిని):**
"ప్రైవేటు వద్దు.. ప్రభుత్వ బడే ముద్దు" అనే నినాదంతో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు రాక్‌టౌన్ కాలనీ వాసులు నడుం బిగించారు. రాజీవ్ గాంధీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు, కొత్త అడ్మిషన్లను పెంచేందుకు పాఠశాల సిబ్బంది, రాక్‌టౌన్ కాలనీ సంక్షేమ సంఘం సంయుక్తంగా 'బడిబాట' కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు ఎర్ర వినోద్ రెడ్డిలిఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కాలనీ వీధుల్లో భారీ ర్యాలీ చేపట్టారు.

**ప్రతిభకు పట్టం.. విద్యార్థులకు సన్మానం:**
గత మూడేళ్లుగా పదో తరగతి ఫలితాల్లో ఈ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ ఏడాది 500లకు పైగా మార్కులు సాధించి పాఠశాల కీర్తిని చాటిన విద్యార్థులను వినోద్ రెడ్డి మరియు కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు పైచదువుల కోసం అవసరమైన పాఠ్యపుస్తకాలు, ఇతర వసతుల కల్పనకు తమ వంతు సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ బృందాన్ని ఈ సందర్భంగా వారు ప్రత్యేకంగా అభినందించారు.

**ఇంటింటికీ వెళ్లి అవగాహన:**
బడికి పోదాం.. భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం" అంటూ నినాదాలు చేస్తూ కాలనీ వీధుల్లో చైతన్య యాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ బడిలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వినోద్ రెడ్డి కోరారు.

**అండగా 'రాక్‌టౌన్ కాలనీ' అసోసియేషన్**
ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రాక్‌టౌన్ అసోసియేషన్ నిరంతరం తోడ్పాటు అందిస్తోంది. గతంలో ఉపాధ్యాయుల కొరత ఉన్న సమయంలో రిటైర్డ్ టీచర్లు క్లాసులు చెప్పేలా ఏర్పాటు చేయడం, దాతల సహకారంతో పాఠశాలకు రంగులు వేయించడం వంటి పనులు చేపట్టారు. అలాగే జాతీయ పండుగల సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు.

**భవిష్యత్ కార్యాచరణ.. నైపుణ్య శిక్షణ**
కేవలం చదువుకే పరిమితం కాకుండా విద్యార్థులకు ఉపాధి మార్గాలు చూపేలా స్వచ్ఛంద సంస్థల సహకారంతో హోటల్ మేనేజ్‌మెంట్, కుట్టు మిషన్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.మున్ముందు విద్యార్థులకు టెక్నికల్ కోర్సులపై అవగాహన కల్పిస్తామన్నారు.యువత డ్రగ్స్, గంజాయి వంటి అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్యం వైపు సాగాలని సూచించారు. కష్టపడి చదివే విద్యార్థులకు అసోసియేషన్ తరపున పూర్తి అండదండలు ఉంటాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీత , ఉపాధ్యాయ బృందం, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గం లో డ్రైనేజీ సమస్య పై సమీక్ష చేసిన ఎమ్మెల్యే.....



**నాగారం, మే 14:- (నేటి దర్శిని):**
ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చర్లపల్లి డివిజన్ ప్రాంతంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సంబంధించి కీలక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డిని ఖైరతాబాద్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు.ఎదుర్కొంటున్న డ్రైనేజీ ఇబ్బందులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ముఖ్యంగా ఐజి సమస్య తీవ్రంగా ఉంది ప్రజలు అనారోగ్యంతో బాధపడుతున్నారని, శాంక్షన్ చేసి పనులు ప్రారంభం చేయాలి అని ఆ సమస్య ను త్వరగా పరిష్కరించాలని ఆయన అన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై స్పందించిన వాటర్ వర్క్స్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపరచడం తమ ప్రాధాన్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ యూజీసీ పేపర్ లీక్‌పై యువజన కాంగ్రెస్ ఆగ్రహం..

**మోడీ దిష్టిబొమ్మదహనం**



**నాగార్జునసాగర్, మే 14 (నేటి దర్శిని):**
నీట్ యూజీసీ పేపర్ లీక్ ఘటనకు నిరసనగా నాగార్జున నగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు కుందూరు జయవీర్ సహకారంతో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని యువజన కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగార్జునసాగర్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు మల్ రెడ్డి భానుచందర్ రెడ్డి మాట్లాడుతూ, గత పదేళ్లలో వరుసగా జరుగుతున్న పేపర్ లీక్‌లు కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ఆరోపించారు. విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల ఆశలు, యువత భవిష్యత్తును బీజేపీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా నాశనం చేస్తోందని విమర్శించారు. దేశంలో విద్యార్థులకు భద్రత కల్పించలేని ప్రభుత్వం అధికారంలో కొనసాగేందుకు నైతిక హక్కు కోల్పోయిందని అన్నారు.
ఎన్‌టీఏ స్వయంగా పేపర్ లీక్ జరిగినట్లు అంగీకరించి పరీక్షను రద్దు చేయడం దేశ విద్యా వ్యవస్థకు మచ్చగా నిలిచిందని పేర్కొన్నారు. పేపర్ లీక్ మాఫియాకు అండగా నిలుస్తున్న శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు రక్షణ కోసం యువజన కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మే 25లోపు ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి: మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

- కేంద్ర ప్రభుత్వ ఆన్‌లైన్ నిర్లక్ష్యమే కొనుగోళ్ల జాప్యానికి కారణమన్న మంత్రి
- సూర్యాపేట జిల్లాలో ఇప్పటికే 93 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి
- మిల్లర్ల నిర్లక్ష్యం, వాహనాల కొరతతో రైతులకు ఇబ్బందులు
- అకాల వర్షాల నేపథ్యంలో వేగంగా కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశాలు
- రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు
- మే 25లోపు ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి: మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి








**నల్లగొండ, మే 14 (నేటి దర్శిని):** యాసంగి ధాన్యం కొనుగోళ్లను ఈ నెల 25వ తేదీలోపు పూర్తిచేయాలని రాష్ట్ర పౌర సరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల యాసంగి ధాన్యం కొనుగోళ్ల సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ అద్దూరి లక్ష్మణ్ తదితరులు హాజరయ్యారు. సమీక్షకు ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కనగల్ మండలం చెట్ల చెన్నారం గ్రామంలోని ఐకేపీ కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లలో జాప్యానికి కేంద్ర ప్రభుత్వ ఆన్‌లైన్ విధానాల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఉత్తంకుమార్ రెడ్డి విమర్శించారు. అమాలీల కొరత, వాహనాల సమస్య, మిల్లర్ల ఆలస్యం కూడా పరిస్థితిని ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు.సూర్యాపేట జిల్లాలో ఇప్పటికే 93 శాతం ధాన్యం కొనుగోలు పూర్తయ్యిందని, యాదాద్రి భువనగిరి జిల్లాలో కూడా వేగంగా ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం రూ.22 కోట్ల అప్పు తీసుకుని ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తోందని తెలిపారు. ఒకే మిల్లర్లపై ఆధారపడకుండా అధికారులు వేగంగా ధాన్యం దిగుమతులు జరిగేలా చూడాలని సూచించారు.ఎమ్మెల్సీ అద్దూరి లక్ష్మణ్ మాట్లాడుతూ, ట్రాన్స్‌పోర్ట్ వాహనాల కొరత ఉంటే సమీప మిల్లులకు ఇసుక ట్రాక్టర్లు లేదా వ్యవసాయ ట్రాక్టర్ల ద్వారా ధాన్యపు బస్తాలను తరలించవచ్చని సూచించారు. అకాల వర్షాలు, వడగండ్ల వానల నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు సుఖేందర్ రెడ్డి, శంకర్ నాయక్, ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు కుందూరు జైవీర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, మందుల సామేలు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే మోడీ సర్కారు లక్ష్యం

- బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



**మిడ్జిల్,మే 14, (నేటి దర్శని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** రైతు సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ సర్కార్ పనిచేస్తున్నారని బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ లో మరోసారి పంటలకు మద్దతు ధర పెంచి నిర్ణయం తీసుకోవడం హర్షదాయకమని అన్నారు.మద్దతు ధర పెంపుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.రైతు పండించిన పంట కు లాభదాయకమైన గిట్టుబాటు ధరను అందించడమే కాకుండా రైతు ఆదాయ భద్రతను పటిష్టం చేస్తుందని అన్నారు.దేశ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు.రైతు సంక్షేమానికి కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు.కేంద్ర ప్రభుత్వానికి ప్రధాని నరేంద్రమోడీ కి కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ రైతు సేవ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య



**రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మే 14,(నేటి దర్శిని):** చేవెళ్ల మండలం తంగడపల్లి గ్రామంలో గురువారం రోజున తెలంగాణ రైతు సేవ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రామ సర్పంచ్ పామేన రాములు తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు సబ్సిడీ ద్వారా అన్ని రకాల విత్తనాలు, పురుగుల మందులు, వ్యవసాయ పనిముట్లు రైతులకు, సబ్సిడీ పై అందించడం జరుగుతుందన్నారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా ఉండేందుకు తెలంగాణ రైతు సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రైతు సేవా కేంద్రం ద్వారా మెరుగైన సేవలను అందిస్తూ, రైతుల నమ్మకాన్ని పెంచేలా నిర్వాహకులు వ్యాపారం కొనసాగించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, నిర్వాహకులు పామేనా శేఖర్, రైతులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జనగణన-2027 ఇంటింటి సర్వేను పరిశీలించిన కలెక్టర్ సి. నారాయణ రెడ్డి





**రంగారెడ్డి, మే 14 (నేటి దర్శిని ప్రతినిధి):** జనగణన--2027 కార్యక్రమంలో భాగంగా కందుకూర్ మండలంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా సర్వే నిర్వహణ తీరు, వివరాల నమోదు, డేటా సేకరణ విధానాలను కలెక్టర్ సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్యుమరేటర్లు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఇంటింటికి వెళ్లి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. జనగణన గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని సూచించారు. తమకు కేటాయించిన బ్లాక్‌లలో ఏ ఒక్క కుటుంబం కూడా మిగలకుండా అన్ని ఇండ్లను కవర్ చేయాలని ఎన్యుమరేటర్లకు స్పష్టం చేశారు. సర్వేలో సేకరించే సమాచారం ఖచ్చితత్వంతో నమోదు చేయడంతో పాటు డిజిటల్ ఎంట్రీలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది ప్రజలకు జనగణన ప్రాధాన్యతను వివరించి వారి సహకారం పొందాలని సూచించారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, తహశీల్దార్, ఎంపీడీఓ, సంబంధిత శాఖల అధికారులు, సర్వే సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

- మందమర్రి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందె రాంచందర్..





**మందమర్రి మే 14:(నేటి దర్శిని):** ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులో ఉందని ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలను ఆదరించి బలోపేతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందె రాంచందర్ అన్నారు. గురువారం చిర్రకుంట గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ రామటెంకి శ్రీలత తిరుపతి తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుంద న్నారు.విద్యార్థులకు ఉచిత నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం,ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించడం జరుగుతుంద న్నారు.ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించి చిన్నారులను ప్రభుత్వ బడుల్లో చేయించాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సమీనా సుల్తానా,సంతోష్, పంచాయతీ కార్యదర్శి రమేష్,కాంగ్రెస్ నాయకులు సంపత్ రావు,దుర్గం సుధాకర్,దుర్గశీ సాగర్, రామటెంకి కమలాకర్, సల్లూరి రాజశేఖర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# వారం రోజులుగా అందని భారత్ గ్యాస్..




- నిడమనూరులో వినియోగదారుల అవస్థలు
- గ్యాస్ కోసం ఎండలో గంటల తరబడి నిరీక్షణ..




**నిడమనూరు, మే 14 (నేటి దర్శిని):** నిడమనూరు మండల కేంద్రంలోని సూర్యప్రకాశ్ భారత్ గ్యాస్ ఏజెన్సీలో గత వారం రోజులుగా గ్యాస్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్ సిలిండర్ల కోసం ప్రతిరోజూ ఏజెన్సీ చుట్టూ తిరుగుతూ నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొంది. గురువారం గ్యాస్ సరఫరా అందడంతో పెద్ద ఎత్తున లబ్ధిదారులు ఏజెన్సీ వద్దకు చేరుకున్నారు. దీంతో భారీ క్యూలైన్లు ఏర్పడి, ఎండ తీవ్రత మధ్య గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడినట్లు స్థానికులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం సూర్యప్రకాశ్ భారత్ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో సుమారు 38 వేల మంది వినియోగదారులు ఉన్నట్లు తెలుస్తోంది. నిడమనూరు మండలంతో పాటు మల్లేపల్లి, హాలియా, పెద్దవూర, తిరుమలగిరి సాగర్, మాడుగులపల్లి మండలాల పరిధిలోని కొన్ని గ్రామాలకు కూడా ఇదే ఏజెన్సీ ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతోంది. అయితే, లబ్ధిదారుల సంఖ్యకు తగిన విధంగా గ్యాస్ సరఫరా లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్యాస్ సరఫరాను పెంచి సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

# బిజినెస్

## చక్కెర ఎగుమతులపై భారత్ నిషేధం..
# అంతర్జాతీయంగా పెరగనున్న ధరలు

చక్కెర ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ నిషేధం తక్షణమే అమలులోకి వచ్చింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు అమలులో ఉంటుందని కేంద్రం తెలిపింది. ఈ మేరకు బుధవారం కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశంలో చక్కెర ధరల్ని నియంత్రించే లక్ష్యంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చక్కెరతోపాటు చక్కెర ఉత్పత్తి చేసే చెరుకు వంటి ముడి పదార్థాల ఎగుమతుల్ని కూడా కేంద్రం నిషేధించింది.ఇటీవలి కాలంలోచక్కెర ఉత్పత్తి తగ్గిపోతోంది. దీంతో ధరలు పెరుగుతున్నాయి. అందుకే కేంద్రం ఈ అంశంపై స్పందించింది. విదేశాలకు భారత చక్కెర ఎగుమతులు నిలిపివేయడంతో అంతర్జాతీయంగా చక్కెర ధరలు పెరిగే అవకాశాలున్నట్లు మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. చక్కెరతోపాటు, సంబంధిత ముడి పదార్థాల ధరలు కూడా అంతర్జాతీయంగా పెరగొచ్చని అంచనా. ఇదే సమయంలో ఇండియాతోపాటు చమురు ఎగుమతుల్లో కీలకంగా ఉన్న బ్రెజిల్,



థాయ్‌లాండ్ వంటి దేశాలకు మంచి వ్యాపార అవకాశాలు దక్కే ఛాన్స్ ఉంది. భారత చక్కెర లేని లోటుని, ఆ దేశాలు తమ దగ్గర ఉత్పత్తైన చక్కెరను అందించి భర్తీ చేయొచ్చు. దీనివల్ల ఆయా దేశాలకు ఆసియా, ఆఫ్రికా మార్కెట్లలో చక్కెర ఎగుమతులపై మంచి పట్టు దొరికే ఛాన్స్ ఉంది. ప్రపంచంలోనే ఇండియా రెండో అతిపెద్ద చక్కెర ఎగుమతిదారు. ఈ ఏడాది 1.59 మిలియన్ మెట్రిక్ టన్నుల చక్కెర ఎగుమతులకు కేంద్రం అనుమతించింది. ఇదే సమయంలో దేశంలో తగినంత చక్కెర ఉత్పత్తి జరిగి, ఇక్కడ ధరలు అందుబాటులో ఉంటాయని భావించింది. అయితే, పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. చక్కెర ఎక్కువగా పండించే అనేక ప్రాంతాల్లో ఈసారి వాతావరణ మార్పులు సహా వివిధ కారణాలతో దిగుబడి తగ్గింది. దీంతో తగినంతగా చమురు ఉత్పత్తి జరగడం లేదు. మార్కెట్ వర్గాల ప్రకారం.. 8 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెర ఉత్పత్తికి ఒప్పందం కుదరగా, 6 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే ఎగుమతి జరిగింది. ఈ నిషేధం తక్షణమే అమలులోకి వచ్చింది. అయితే, ఇప్పటికే లోడింగ్ ప్రారంభమైన వాటికి మాత్రం వర్తించదు.

## జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆకాశ్ అంబానీ



భారత వ్యాపార దిగ్గజం ముకేశ్ అంబానీ పెద్ద కుమారుడు ఆకాశ్ అంబానీ ని జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ గా నియమించారు. రిలయన్స్ కు చెందిన ఈ డిజిటల్ సేవల సంస్థ ఐపీవోకు వెళ్ళనుంది. ఈ నేపథ్యంలో ఆకాశ్ అంబానీని మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. ఏప్రిల్ 9 నుంచి ఈ నియామకం అందుబాటులోకి వచ్చినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఐదేళ్ల కాలంపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని మే 7న సమర్పించిన ఫైలింగ్ లో పేర్కొన్నది.జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీవోకు సన్నద్ధమవుతున్న వేళ ఈ నియామకం చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఏడాది మే నెలాఖరున లేదా జూన్ నెలలో ఐపీవోకు సంబంధించిన ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించే అవకాశం ఉంది. టెలికం విభాగమైన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ బోర్డులో 2014 అక్టోబర్ నుంచి ఆకాశ్ అంబానీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2022 జూన్ నెలలో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆకాశ్ అంబానీ నేతృత్వంలో జియో 2016 లోనే కేవలం ఆరు నెలల వ్యవధిలో 10 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకుంది. 2026 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.30 వేల కోట్ల నికర లాభాన్ని రూ.1.46 లక్షల కోట్ల ఆదాయాన్ని నమోదుచేసింది.

## భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు..
# సెన్సెక్స్ 789 పాయింట్లు లాభం

భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 789 పాయింట్లు లాభపడి 75,398.72 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 277 పాయింట్లు లాభపడి 24,689.60 వద్ద ముగిసింది. కొనుగోళ్లు, అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ఉండటంతో మార్కెట్లు లాభాలబాటలో నడిచాయి.సెన్సెక్స్ ఉదయం 74,947 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 75,681 గరిష్ట స్థాయికి చేరింది. చివరకు 75,398 వద్ద ముగిసింది. 30 షేర్స్ బీఎస్ఈ ఇండెక్స్‌లో భారతి ఎయిర్‌టెల్, ఎటర్నల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా సంస్థలు భారీ లాభాలు గడించాయి. మారుతి, యాక్సిస్ బ్యాంక్, హిందుస్తాన్ యునీలీవర్, టీసీఎస్, హెచ్‌సీఎల్ సంస్థల షేర్లు నష్టపోయాయి. భాతర మార్కెట్లు గత నాలుగు సెషన్లలో 4 శాతం



పైగా నష్టపోయాయి. క్రూడాయిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో ఇటీవల ప్రధాని మోదీ.. చమురును జాగ్రత్తగా వాడుకోవాలని సూచించిన నేపథ్యంలో మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడింది. అంతర్జాతీయ మార్కెట్లైన జపాన్ నిక్కీ, దక్షిణ కొరియా కోస్పి, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ సూచీలు లాభాల్లో ట్రేడయ్యాయి. భారత మార్కెట్లు లాభాలు చూసినప్పటికీ డాలర్‌తో రూపాయి మార్కెట్ విలువ మాత్రం తగ్గిపోయింది. గురువారం డాలర్‌తో రూపాయి విలువ తగ్గిపోయి 95.73 వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర కూడా పెరిగింది. గురువారం బ్యారెల్ క్రూడాయిల్ ధర 0.50 పెరిగి, 106.16 వద్ద కొనసాగుతోంది.

# స్పోర్ట్స్

# బంగ్లాదేశ్ చేతిలో ఘోర ఓటమి..

పాకిస్థాన్ టెస్టు క్రికెట్ జట్టులో పెను మార్పులు చోటుచేసుకోనున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో ఎదురైన ఘోర పరాజయం నేపథ్యంలో, ప్రస్తుత కెప్టెన్ షాన్ మసూద్‌ను తొలగించి, ఆ బాధ్యతలను తిరిగి స్టార్ బ్యాటర్ బాబర్ ఆజామ్‌కు అప్పగించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు యోచిస్తోంది. ఢాకాలోని షేర్-ఎ-బంగ్లా స్టేడియంలో బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ 104 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. 268 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 163 పరుగులకే కుప్పకూలింది. షాన్ మసూద్ సారథ్యంలో పాకిస్థాన్ ఇప్పటివరకు ఆడిన 15 టెస్టుల్లో ఏకంగా 11 ఓటములను నమోదు చేయడం గమనార్హం. ఒక పాకిస్థాన్ కెప్టెన్‌కు ఇది అత్యంత చెత్త రికార్డుగా నిలిచింది. బ్యాటర్‌గా కూడా మసూద్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ విఫలమవడంతో (మొదటి ఇన్నింగ్స్‌లో 9, రెండో ఇన్నింగ్స్‌లో 2 పరుగులు), అతనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మోకాలి గాయం కారణంగా తొలి టెస్టుకు దూరమైన బాబర్ ఆజామ్, మే 18 నుండి ప్రారంభం కానున్న రెండో టెస్టు నాటికి



పూర్తి ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన పాకిస్థాన్ సూపర్ లీగ్ లో పెషావర్ జల్మీని ఛాంపియన్‌గా నిలబెట్టడంతో పాటు, టోర్నీలో అత్యధిక పరుగులు (11 ఇన్నింగ్స్‌ల్లో 588 పరుగులు) సాధించిన ఆటగాడిగా బాబర్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. పీసీబీలోని కీలక వ్యక్తులు బాబర్‌ను తిరిగి కెప్టెన్‌గా నియమించడం ద్వారా జట్టును గాడిలో పెట్టవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో పాకిస్థాన్‌కు ఇంకా ఏడు టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ కీలక దశలో అనుభవజ్ఞుడైన బాబర్ నాయకత్వమే సరైనదని బోర్డు వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. కేవలం టెస్టులకే పరిమితం కాకుండా, వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ నాటికి బాబర్‌ను వన్డే కెప్టెన్‌గా కూడా సిద్ధం చేయాలని పీసీబీ యోచిస్తోంది. బాబర్ గతంలో 2019 నుండి 2023 వరకు మూడు ఫార్మాట్లలోనూ జట్టుకు నాయకత్వం వహించారు. 2023 ప్రపంచకప్ తర్వాత తప్పుకున్న బాబర్, ఆపై కొద్దికాలం టీ20 కెప్టెన్‌గా తిరిగి వచ్చినా ఆ తర్వాత మళ్ళీ ఆ బాధ్యతల నుంచి వైదొలిగారు. మరోవైపు, షాన్ మసూద్‌కు జట్టులో ఏదైనా పరిపాలనాపరమైన లేదా ఇతర బాధ్యతలు అప్పగించే ఆలోచన కూడా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న సిరీస్ తర్వాత కెప్టెన్ మార్పుపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. బాబర్ ఆజామ్ రెండో టెస్టులో తన బ్యాటింగ్ ఫామ్‌ను నిరూపించుకుంటే, అతని కెప్టెన్సీ పట్టాభిషేకానికి ఇక అడ్డంకులు ఉండబోవని విశ్లేషకులు భావిస్తున్నారు.


## సన్‌రైజర్స్ హైదరాబాద్
# ప్లేఆఫ్స్ చేరాలంటే



ఐపీఎల్ 2026లో భాగంగా అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చిత్తు చిత్తుగా ఓడిపోయిన సంగతి తెలిసిందే. 82 పరుగుల తేడాతో ఘోర ఓటమిని చవిచూసింది. ఫలితంగా ఎస్ఆర్‌హెచ్ నెట్‌రన్‌రేటు (ం0.331) దారుణంగా పడిపోయింది. ఈ ఓటమితో పాయింట్ల పట్టికలో ప్రస్తుతానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ స్థానం మారకున్నా కూడా ప్లేఆఫ్స్ అవకాశాలు మాత్రం కొద్దిగా కష్టంగా మారాయి. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలవాల్సిన పరిస్థితి ఉంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ 12 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 7 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. మరో 5 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ప్రస్తుతం 14 పాయింట్లతో పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతోంది. లీగ్ దశలో ఎస్ఆర్‌హెచ్ మరో రెండు మ్యాచ్‌లు మే 18న చెన్నైతో, మే22న ఆర్‌సీబీతో ఆడనుంది. అయితే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ప్లేఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకోవాలంటే.. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు మిగిలిన రెండు మ్యాచ్‌లు.. చెన్నై, ఆర్‌సీబీపై విజయం సాధించాల్సి ఉంటుంది. అప్పుడు సన్‌రైజర్స్ ఖాతాలో 18 పాయింట్లు ఉంటాయి. మెరుగైన రన్‌రేటు కలిగి ఉంటే ఇతర జట్ల సమీకరణాలు కలిసి వస్తే టాప్-2లో కూడా చోటు దక్కించుకోవచ్చు. ఇక మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఎస్ఆర్‌హెచ్ ఒక్క మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికి కూడా ప్లేఆఫ్స్‌కు చేరుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే.. అప్పుడు సన్‌రైజర్స్ ఖాతాలో 16 పాయింట్లు ఉంటాయి. అయినా కూడా ఇతర జట్ల ఫలితాలతో పాటు నెట్‌రన్‌రేటుపై ఆధారపడాల్సి ఉంటుంది. ఇందుకోసం నెట్‌రన్‌రేటును మెరుగు పరుచుకోవాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే.. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓడిపోతే మాత్రం అప్పుడు ప్లేఆఫ్స్ ఛాన్స్ సంక్లిష్టం అవుతుంది. 14 పాయింట్లే ఎస్ఆర్‌హెచ్ ఖాతాలో ఉంటాయి. నాలుగో స్థానంతోనైనా ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టే అవకాశం ఉంది. 14 పాయింట్లు సాధించిన మిగిలిన జట్ల కంటే ఎస్ఆర్‌హెచ్ రన్‌రేటు మెరుగ్గా ఉండడంతో పాటు మూడు కంటే ఎక్కువ జట్లు ఎస్ఆర్‌హెచ్ పాయింట్ల కంటే ఎక్కువగా ఉండకూడదు.

# శార్దూల్ బంతికి బిత్తరపోయిన శ్రేయస్ అయ్యర్

ధర్మశాల స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ ధాటిగా ఇన్నింగ్స్ ప్రారంభించింది. 11 ఓవర్లు ముగిసేసరికి పంజాబ్ ఒక వికెట్ నష్టానికి 107 పరుగులు చేసి పటిష్ట స్థితిలో ఉంది. ఈ దశలో ముంబై తాత్కాలిక కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా, 12వ ఓవర్ వేసే బాధ్యతను శార్దూల్ ఠాకూర్‌కు అప్పగించాడు. ఆ ఓవర్ రెండో బంతికే సెంచరీ దిశగా సాగుతున్న ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌ను అవుట్ చేసిన శార్దూల్, ముంబైకి బ్రేక్ ఇచ్చాడు. ప్రభ్‌సిమ్రాన్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఎదుర్కొన్న మొదటి బంతికే ఫోర్ కొట్టి శుభారంభం చేశాడు. అయితే ఆ మరుసటి బంతికే శార్దూల్ ఒక అద్భుతాన్ని సృష్టించాడు. గుడ్ లెంగ్త్‌లో పడిన బంతి అనూహ్యంగా స్వింగ్ అవుతూ ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. ఆ బంతిని అంచనా వేయడంలో అయ్యర్ పూర్తిగా విఫలమయ్యాడు. బంతి వెళ్లిన వేగానికి, ఆ స్వింగ్‌కు అయ్యర్ నోరెళ్లబెట్టాడు. కనీసం బంతి ఎటు నుంచి వచ్చిందో కూడా అర్థం కాక అయోమయంలో ఉండిపోయాడు.అయ్యర్ వికెట్



తీసిన వెంటనే శార్దూల్ ఆనందానికి అవధులు లేవు. మైదానంలో పరుగెత్తుతూ తనదైన శైలిలో సంబరాలు చేసుకున్నాడు. ఒకే ఓవర్లో ఇద్దరు కీలక బ్యాటర్లను అవుట్ చేసి పంజాబ్‌ను కష్టాల్లోకి నెట్టాడు. ఈ వీడియో ఇప్పుడు క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. నెటిజన్లు దీనిని "సీజన్ ఉత్తమ బంతి"గా అభివర్ణిస్తున్నారు. కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో శార్దూల్ చేసిన ఈ ప్రయోగం ముంబై జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపింది.మంచి ఆరంభం లభించినా, శార్దూల్ వేసిన ఆ ఒక్క ఓవర్ పంజాబ్ స్కోరు వేగాన్ని తగ్గించింది. కెప్టెన్ అయ్యర్ తక్కువ పరుగులకే వెనుదిరగడం జట్టుపై ఒత్తిడి పెంచింది. బుమ్రా వ్యూహం పారడంతో ముంబై ఇండియన్స్ మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఈ అద్భుతమైన డెలివరీ ఐపీఎల్ చరిత్రలో ఒక ప్రత్యేకమైన వికెట్‌గా నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.

# ఆహాలోకి వచ్చిన 'తిమ్మరాజుపల్లి టీవీ'..

## గోల్డ్ సబ్‌స్క్రైబర్లకు ముందస్తు స్ట్రీమింగ్!




తెలుగు ఓటీటీ ప్రేక్షకులకు ప్రముఖ ప్లాట్‌ఫామ్ ఆహా మరో ఇంట్రెస్టింగ్ మూవీని అందుబాటులోకి తీసుకొచ్చింది. యువ హీరో కిరణ్ అబ్బవరం నిర్మాతగా తెరకెక్కిన రూరల్ ఎంటర్టైనర్ తిమ్మరాజుపల్లి టీవీ ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ఇటీవల థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద డీసెంట్ టాక్ సంపాదించుకుంది. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఈ మూవీకి ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి మంచి స్పందన లభించింది. ఈ చిత్రాన్ని దర్శకుడు వి. మునిరాజ్ తెరకెక్కించారు. ముఖ్యంగా ఈ సినిమాలో దాదాపు 50 మంది కొత్త ఆర్టిస్టులకు అవకాశం ఇవ్వడం విశేషం. గ్రామీణ జీవనశైలి, పల్లెటూరి భావోద్వేగాలు, వినోదాన్ని మేళవిస్తూ రూపొందించిన ఈ చిత్రం కొత్త తరహా కథనంతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

# మైసా' కోసం రష్మిక కష్టాలు ..

## కాళ్లకు టేప్ వేసుకొని మరి..!




ıస్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆమె నటిస్తున్న యాక్షన్ డ్రామా 'మైసా'పై ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కేరళ షెడ్యూల్ పూర్తి చేసిన రష్మిక.. అక్కడి అనుభవాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. కొచ్చిలో జరిగిన షూటింగ్ గురించి రష్మిక చేసిన పోస్టులు ఇప్పుడు నెటింట చర్చనీయాంశంగా మారాయి. ప్రకృతి అందాలు, అడవులు, జలపాతాలు, ఎత్తైన కొండలు, వర్షాల మధ్య సాగిన షూటింగ్ తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని ఆమె వెల్లడించారు.ప్రత్యేకంగా ఎత్తైన ప్రదేశాలంటే తనకు భయం ఉన్నప్పటికీ.. 'మైసా' సినిమాలో యాక్షన్ సన్నివేశాల కోసం ఆ భయాన్ని ఎదుర్కొంటూ స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నానని రష్మిక తెలిపారు. షూటింగ్ సమయంలో అడవుల్లో ట్రెక్కింగ్, ఔట్‌డోర్ యాక్షన్ ఎపిసోడ్స్, భారీ వర్షాల మధ్య చిత్రీకరణ చాలా కష్టంగా సాగిందని చెప్పారు. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీన్ల కోసం శారీరకంగా చాలానే శ్రమపడాల్సి వచ్చిందని రష్మిక వెల్లడించారు. మోకాళ్లు, కాళ్లకు టేపింగ్ వేసుకుని కూడా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నానని తెలిపారు. తనతో పనిచేస్తున్న యూనిట్ సభ్యులు కూడా జాగ్రత్తగా ఉండాలని తరచూ చెప్పేదాన్నని గుర్తు చేసుకున్నారు. అయితే ఈ కష్టాల మధ్య కేరళలో ఫేమస్ అయిన 'పాళమ్ పూరీ'ని మాత్రం బాగా ఎంజాయ్ చేశానంటూ సరదాగా చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. అలాగే బాల్కనీలో నిలబడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న కొన్ని ఫొటోలను కూడా రష్మిక ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ ఫొటోల్లో ఆమె చాలా నేచురల్‌గా కనిపించడంతో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక 'మైసా' సినిమా విషయానికి వస్తే.. దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రష్మిక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా హై ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం రష్మిక ఇప్పటికే థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేక యాక్షన్ ట్రైనింగ్ కూడా తీసుకున్నట్లు తెలిసింది. తాజాగా కేరళలో జరిగిన షెడ్యూల్‌లో కీలకమైన స్టంట్స్‌ను చిత్రీకరించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. షెడ్యూల్ పూర్తైన సందర్భంగా యూనిట్ సభ్యులతో కలిసి తీసుకున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన రష్మిక.. "ఇంత కష్టపడి పనిచేసిన నా టీమ్‌కు థ్యాంక్యూ.. త్వరలో మళ్లీ సెట్స్‌లో కలుద్దాం" అంటూ ఎమోషనల్‌గా స్పందించారు.

# బన్నీతో జోడీగా?



మంగళూరు సోయగం పూజాహెగ్డేకు తెలుగులో మళ్లీ మంచి రోజులొచ్చాయి. గతకొంతకాలంగా ఇక్కడ భారీ హిట్‌కోసం ఎదురుచూస్తున్న ఈ భామ అందుకు తగినట్లుగానే ఆచితూచి అడుగులు వేస్తున్నది. ఇప్పటికే ఆమె దుల్కర్ సల్మాన్‌తో కలిసి ఓ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం అల్లు అర్జున్‌తో ఈ సొగసరి ముచ్చటగా మూడోసారి జోడీకట్టబోతున్నట్లు వార్తలొస్తున్నాయి.ప్రస్తుతం సైంటిఫిక్ ఫిక్షన్ 'రాకా'లో నటిస్తున్నారు అల్లు అర్జున్. దీని తర్వాత లోకేష్ కనకరాజ్ డైరెక్షన్‌లో సినిమా చేయాల్సి ఉంది. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నది. ఇందులో పూజాహెగ్డే కథానాయికగా ఖరారయ్యే ఛాన్స్ ఉందని ఫిల్మ్‌నగర్ టాక్. ఇప్పటికే బన్నీ-పూజాహెగ్డే కలిసి 'డీజే' 'అల వైకుంఠపురములో' చిత్రాల్లో నటించిన విషయం తెలిసిందే. వీరిద్దరికి హిట్‌పెయిర్‌గా గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో మూడోసారి ఈ జంట జోడీ కట్టనుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.




# బోల్డ్ క్యారెక్టర్స్ చేసిన అందాల భామ!

గతంలో తమన్నా కెరీర్ నెమ్మదించిందన్న వార్తలకు మిల్కీ బ్యూటీ తెరదించారు. ఒక దశలో అవకాశాలు తగ్గాయని భావించిన ఈ భామ, ఇప్పుడు వరుస ప్రాజెక్ట్ లతో తన కెరీర్ కు కొత్త ఊపునిచ్చారు. ప్రస్తుతం తమన్నా ఇతర సీనియర్ హీరోయిన్లలో ఎవరూ లేనంత బిజీగా ఉన్నారు, పలు ప్రతిష్టాత్మక చిత్రాలలో భాగమవుతున్నారు.కొద్ది రోజుల క్రితం తమన్నా సిల్వర్ స్క్రీన్ ప్రయాణం చివరి దశకు చేరుకుందని, ఆమె ఓటీటీ ప్రాజెక్టులకే పరిమితం అవుతున్నారని ప్రచారం జరిగింది. కానీ, ఆ ఊహాగానాలన్నిటినీ పటాపంచలు చేస్తూ, స్వల్ప విరామం తర్వాత తమన్నా తిరిగి ఫామ్ లోకి వచ్చారు. ఆమె ఒక వైపు స్పెషల్ సాంగ్స్ తో ప్రేక్షకులను అలరిస్తూనే, మరోవైపు ప్రధాన పాత్రల్లో నటిస్తూ తన సత్తాను చాటుకుంటున్నారు. ప్రస్తుతం తమన్నా చేతిలో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన వన్, వరుణ్ ధావన్ తో కలిసి నో ఎంట్రీ 2, జాన్ అబ్రహం తో మారియా ఐపీఎస్ వంటి పెద్ద సినిమాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులతో పాటు, ఆమె ఒక కీలకమైన మరియు బోల్డ్ నిర్ణయం తీసుకున్నారు.

# రంగంలోకి సూర్య.. 'కరుప్పు' చిక్కులకు చెక్ పడ్డట్టే..!



కోలీవుడ్ స్టార్ సూర్య నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి కరుప్పు. పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తెలుగులో వీరభద్రుడు టైటిల్‌తో విడుదల కానుంది. ఈ చిత్రం మే 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కావాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం గురువారం ఉదయం నుంచే థియేటర్లలో షోలు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ రిలీజ్‌కు ముందు ఆర్థికపరమైన చిక్కులు తలెత్తడంతో మార్నింగ్ షోలు నిలిచిపోయినట్లు వార్తలు వచ్చాయని తెలిసిందే.తమిళనాడులో ప్రత్యేక షోలకు అనుమతులు వచ్చినప్పటికీ, అవి కూడా రద్దు కావడం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. చివరి నిమిషంలో షోలు రద్దు కావడంతో అభిమానులు నిరాశ చెందుతున్నారు. ఇదిలా ఉంటే మేకర్స్ , ఫైనాన్షియర్ల మధ్య నెలకొన్న సమస్యల కారణంగా డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు కొంత అయోమయంలో పడ్డారని ఇన్‌సైడ్ టాక్. కాగా ఈ సమస్యను కొలిక్కి తీసుకువచ్చేందుకు సూర్య స్వయంగా రంగంలోకి దిగాడట. సంబంధిత ఫైనాన్షియర్లతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి హామీనిచ్చినట్టు సమాచారం. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం నుంచి సినిమా థియేటర్లలో స్క్రీనింగ్ అయ్యే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ సర్కిల్ టాక్.ఈ మూవీలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. చాలా కాలం తర్వాత సూర్య, త్రిష కాంబోలో వస్తున్న సినిమా కావడంతో క్యూరియాసిటీ పెరిగిపోతుంది. ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్‌పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ ఆర్ ప్రకాశ్ బాబు, ఎస్‌ఆర్ బాబు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సాయి అభ్యాంకర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# కేడీ ట్రైలర్ విడుదల




ధ్రువ్ సర్జా హీరోగా ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కేడీ: ది డెవిల్' మే 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. సంజయ్ దత్ కీలకపాత్రలో నటించారు. తాజాగా దీని తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'ఇది అంతం కాదు.. ఆరంభం' అని ధ్రువ్ తన డైలాగులతో ఆకట్టుకుంటున్నారు. ఈ సినిమాలోని ఓ పాట పలు వివాదాలకు కారణమైన విషయం తెలిసిందే. దాన్ని అన్ని సోషల్ మీడియా వేదికల్లోనూ తొలగించారు. దీంతో తెలుగులో ఆ పాటను ఉంచుతారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365